

టగ్ ఆఫ్ వార్ రన్నరప్ నెల్లూరు



అనంతపురంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ముగిశాయి. టగ్ ఆఫ్ వార్ పోటీలో నెల్లూరు జట్టు ద్వితీయ స్థానం సాధించి మంత్రులు అనగాని, పయ్యావుల నుంచి బహుమతి అందుకుంది.

హైవే విస్తరణ



- నెల్లూరు-తడ మధ్య ఎన్‌హెచ్‌కి మంచి రోజులు
- ఎట్టకేలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం
- ఆరు వరుసలుగా మార్చేందుకు నిర్ణయం
- డీపీఆర్ తయారీకి ఏజెన్సీ నియామకం
- చింతారెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబీకి గ్రీన్‌సిగ్నల్

నెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్ట మొదటగా ప్రారంభమైన నాలుగు వరుసల జాతీయ రహదారి నెల్లూరు-తడ బిట్. అయితే ఇప్పటికీ ఆ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. చుట్టు పక్కల రోడ్లన్నీ ఆరు వరుసలుగా నిర్మాణమవుతున్నాయి. చెన్నై, తిరుపతి, బెంగళూరు నగరాలకు రాకపోకలు అధికమయ్యాయి. అయినా నెల్లూరు-తడ మధ్య మాత్రం ఇంకా నాలుగు వరుసల రహదారితోనే ఆగింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెల్లూరు-తడ మధ్య ఉన్న 110 కిలోమీటర్ల బిట్‌ను ఆరు వరుసలుగా మార్చాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి డీపీఆర్‌ను తయారు చేసేందుకు ఓ ఏజెన్సీని ఎంపిక చేసింది. ఏడాదిలోగా ఆ ఏజెన్సీ నివేదిక అందజేసేలా గడువు విధించగా, ఈనెలలో ఆ ఏజెన్సీ జిల్లాలో డీపీఆర్ తయారీని ప్రారంభించినట్లు జాతీయ రహదారుల సంస్థ వర్గాలు వెల్లడించాయి.

● ఎన్నాళ్లో వేచిన సమయం...

ఉత్తర-దక్షిణ భారతాన్ని కలపడంలో అత్యంత కీలకమైన రహదారిగా ఉంటూ, విపరీతమైన రద్దీ రహదారిగా మారుతున్న తరుణంలో ఎన్‌హెచ్-16(గతంలో ఎన్‌హెచ్-5)ను నాలుగు వరుసల నుంచి ఆరు వరుసల రహదారిగా విస్తరించాలని పదిహేనేళ్ల నుంచి డిమాండ్లు ఉన్నాయి. ఈ రహదారి ప్రాముఖ్యత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఒక్క నెల్లూరు-తడ మధ్య మినహా మిగిలిన భాగం మొత్తాన్ని ఆరు వరుసలుగా మార్చింది. ఆరేళ్ల క్రితమే పూర్తిస్థాయిలో ఈ ఆరు వరుసల రహదారి అందుబాటులోకి వచ్చింది. విజయవాడ నుంచి నెల్లూరు వరకూ ఆరు వరుసల రహదారి ఉండగా, అక్కడ వరకూ వేగంగా వచ్చే వాహనాలు అక్కడి నుంచి నెమ్మదిస్తున్నాయి. మళ్లీ తడ తర్వాత ఆరు వరుసల రహదారి మొదలవుతుంది. ప్రస్తుతం జిల్లాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఆ ప్రభావం ఎన్‌హెచ్-16పై తీవ్రంగా ఉంటోంది. నెల్లూరు నుంచి విజయవాడకు 300 కిలోమీటర్ల దూరం ఉండగా 3:30 గంటల్లో చేరుకుంటున్నారు. అదే నెల్లూరు నుంచి చెన్నైకు 160 కిలోమీటర్లు ఉండగా మూడు గంటల సమయం పడుతోంది. అదే ఆరు వరుసల రహదారిగా మారిస్తే రెండు గంటల్లోనే చేరుకోవచ్చు. అదే సమయంలో ఇప్పుడు చాలా ఊర్ల దగ్గర ఫ్లైవోవర్ బ్రిడ్జిలు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆరు వరుసల రహదారి విస్తరణ సమయంలో ప్రతీ గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది. కాబట్టి రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయి. అదే సమయంలో ఈ ఆరు వరుసల విస్తరణ ఫలితం జిల్లా పారిశ్రామికీకరణకు ఎంతో దోహదపడుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నగరంలోని చింతారెడ్డిపాలెం వద్ద హైవే కూడలి



నెల్లూరులో ఇప్పటికే అయ్యప్పగుడి సెంటర్, గొలగమూడి క్రాస్ రోడ్ల వద్ద జాతీయ రహదారిపై ఆర్‌వోబీల నిర్మాణం జరుగుతోంది. తాజాగా మరో కీలక జంక్షన్ అయిన చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద కూడా ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణంతో పాటు ముత్తుకూరు రోడ్డును కలుపుతూ ఇరువైపులా సర్వీసు రోడ్డు కూడా నిర్మించనున్నట్లు ఎన్‌హెచ్ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకుగానూ సుమారు

● చింతారెడ్డిపాలెం వద్ద ఆర్‌వోబీ

రూ.121 కోట్లతో అంచనాలు రూపొందించినట్లు సమాచారం. నెల్లూరు సిటీలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో చింతారెడ్డిపాలెం జంక్షన్ కూడా ఒకటి. చాలా కాలం నుంచి ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలన్న డిమాండ్ ఉంది. జిల్లాలోని ఎంపీలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్ర సానుకూలంగా స్పందించి ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం కీలక పరిణామం. కాగా ఆర్‌వోబీ నిర్మాణం కోసం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మూడునాలుగు సార్లు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి విన్నవించారు.

నెల్లూరు(సిటీ): నగరంలోని చింతారెడ్డిపాళెం క్రాస్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రభుత్వం ఆదివారం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. నగర ప్రజలకు ఇది శుభవార్త అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అరణ్య రోదన



నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పందిళ్లపల్లి శ్రీనివాసులు (ఐఎఫ్ఎస్) 1982లో కర్ణాటక రాష్ట్రంలో డీఎఫ్‌వో గా విధులు నిర్వహించేవారు. ఎర్రచందనం స్మగ్లర్ వీరప్పన్‌లో మార్పుకోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. 1991లో నవంబరు 9న 'లొంగిపోతా.. నువ్వు ఒక్కడివే అడవిలోకి రావాలి' అంటూ వీరప్పన్ కబురు పంపాడు. డీఎఫ్‌వో శ్రీనివాసులు నవంబరు 10న అడవిలోకి వెళ్లాడు. వీరప్పన్ శ్రీనివాసులును దారుణంగా హత్యచేశాడు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన శ్రీనివాసులుకు కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర బిరుదు ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతిఏటా నవంబరు 10న(నేడు) రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అటవీ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక కథనం.

- అటవీ శాఖలో ఏళ్ల తరబడి భర్తీ కాని పోస్టులు
- ఉన్నవారిపై అదనపు పనిభారం
- 3,500 హెక్టార్లకు ఒక్కరే పర్యవేక్షణ

● వెంటాడుతున్న ఉద్యోగుల కొరత

ఎర్రచందనం, వన్యప్రాణులు అటవీ సంపద. వీటి రక్షణ కోసం అటవీశాఖ ఉద్యోగులు కుటుంబాలను సైతం వదలి అడవుల్లో విధి నిర్వహణ చేస్తుంటారు. జిల్లాలో దాదాపు 2,82,000 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. ఉద్యోగులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నారు. 3500 హెక్టార్లకు ఒక్కరే రక్షణ కల్పించాల్సిన పరిస్థితి ఉంది. క్షేత్ర స్థాయి ఉద్యోగాల భర్తీ జరిగి ఏళ్లు గడుస్తోంది. ఉన్న ఉద్యోగులు, సిబ్బందిపై పనిభారం పెరిగింది. ఎర్రచందన స్మగ్లర్లతో పోరాటం చేయాలంటే అత్యాధునిక ఆయుధాలు ఉండాలి. కానీ ప్రభుత్వం రేంజ్ అధికారి స్థాయిలో కొన్ని గన్‌లను అందించారు.కానీ క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు ఆయుధాలు అందించలేదు.

త్వరలోనే పోస్టుల భర్తీ

త్వరలోనే జిల్లాలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించేందుకు అత్యాధునిక సంకేతికతను ఉపయోగిస్తున్నాం. అడవుల్లో మొత్తం సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎర్రచందనం స్మగ్లింగ్ జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. సిబ్బందికి ఆయుధాలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే రేంజర్లకు అందచేశాం.



- మహబూబ్ బాషా, జిల్లా అటవీ అధికారి



నేడు అటవీ అమర వీరుల సంస్మరణ దినం

నేడు అమరవీరులకు నివాళులు

అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా నెల్లూరులోని నిప్పో కూడలి వద్ద గల జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఉదయం అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించనున్నారు. నెల్లూరు రేంజర్ మాల్యాద్రి ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం మెగా వైద్య శిబిరంతోపాటు రక్తదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డొంక పోరంబోకే కదా...

దర్జాగా కబ్జా!

- స్థలం విలువ రూ. కోట్లలో..
- మామూళ్ల మత్తులో రెవెన్యూ అధికారులు
- ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

పొదలకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కబ్జారాయుళ్లకు అడ్డూఆపూ లేకుండా పోయింది. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వం ఏదైనా అధికారులు మాత్రం తమ పంథా మార్చుకోవడం లేదు. వారు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. తాజాగా ఇలాంటి కబ్జానే పొదలకూరులో వెలుగు చూసింది. ఓ వ్యక్తి టైలర్స్ కాలనీ సమీపంలో దుకాణ సముదాయం పక్కన మెయిన్ రోడ్డు ఆనుకుని కొంతమేర స్థలాన్ని ఆక్రమించి రేకులు వేశాడు. అలాగే మెయిన్ రోడ్డు నుంచి వీవర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న డొంక పోరంబోకు స్థలం సుమారు 30 అంకణాల వరకు ఆక్రమించి ఫెన్సింగ్ రాళ్లు నాటాడు. ఆ స్థలం పక్కనే ఉన్న స్వర్ణ లేఅవుట్‌లో అంకణం రూ.3లక్షల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఆక్రమణ స్థలం విలువ దాదాపు రూ.కోటి పైన ఉంటుంది. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొదలకూరులో అధికార పార్టీ నాయకులకు తెలియకుండా ఏమీ జరగదని, ఒకరిద్దరు అధికార పార్టీ నాయకుల ప్రమేయంతోనే ఈ స్థలం కబ్జాకు గురవుతోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

నెల్లూరురూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్‌లోని వెల్లంటి చెరువులో ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ సీఐ వేణు అందించిన వివరాల మేరకు.. నెల్లూరులోని పొదలకూరురోడ్డు శివాజీనగర్‌కు చెందిన ఉయ్యాల సురేంద్ర (29) సజ్జాపురం గ్రామంలో వివాహం చేసుకున్నాడు. భార్య, భర్తల మధ్య తలెత్తిన వివాదాలతో క్షణికావేశానికి గురైన అతను వెల్లంటి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

బీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(విద్య), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నెల్లూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా మణిసుబ్బు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా మాస ప్రసాద్, నిర్వాహక కార్యదర్శిగా వై శ్రీనివాసులు, కోశాధికారిగా డీ రాజశేఖర్, ఆడిట్ కార్యదర్శిగా టీవీ కృష్ణయ్య, మహిళా కార్యదర్శిగా ఆర్ భాగ్యమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు పదిమంది ఉపాధ్యక్షులు, ఐదుగురు మహిళా కార్యదర్శులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ తెలిపారు.

ఆయకట్టు రైతుల సంక్షేమానికి కృషి

- రెండో పంటగా మొక్కజొన్న వేయాలి
- రాళ్లపాడు నీటి విడుదల సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ఆయకట్టు రైతుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేసి, జలహారతి ఇచ్చారు. అనంతరం కుడి, ఎడమ కాలువల తూములు ఎత్తి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పైరు సాగు కోసం నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సోమశిల నుంచి నీరు విడుదల చేస్తే నాలుగు రోజుల్లో ప్రాజెక్టుకు వస్తాయని తెలిపారు. రెండో పంటగా రైతులు మొక్కజొన్న సాగు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈలు ఎం. వెంకటేశ్వర్లు, పీ. శేషయ్య, ఆయకట్టు ఛైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, నీటి సంఘాల అధ్యక్షుడు ఎన్. మాలకొండారెడ్డి, సుబ్బారావు, పీ బుచ్చయ్య, ఏ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము ఎత్తి నీటిని విడుదల చేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, తదితరులు

● సోమశిలలో 71.895 టీఎంసీలు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 14,249 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 71.895 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● కండలేరులో 58.46 టీఎంసీలు

రాపూరు : కండలేరు డ్యాంలో 58.46 టీఎంసీల నీరు ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 640 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

అమ్మో... కూరగాయలు !

- పలు రకాలు కిలో రూ.100పైనే..
- కొనలేం.. తినలేం.. అంటున్న సామాన్యులు



కూరగాయలు	ధరలు (రూ...లో):
టమోటా	40
పచ్చిమిర్చి	70
దొండకాయ	120
బెండకాయ	120
వంకాయ	100
బీన్స్	160
కాకర	120
క్యారెట్	120
చిక్కుళ్లు	160
మునక్కాయ	200
బీరకాయ	120
బంగాళదుంప	60
ముల్లంగి	80

ఉదయగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల తీవ్ర వర్షాల కారణంగా ఇటు రైతులు, అటు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాల వల్ల రైతులు సాగు చేసిన కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీనికి తోడు కార్తీకమాసం కావడంతో మాంసాహారం తగ్గి శాకాహారం పెరిగింది. దీంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి.

● ఉత్పత్తి తగ్గడంతోనే...

ఉదయగిరి మార్కెట్‌లో వారం నుంచి కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దొండ, బెండ, బీన్స్ కాకర, క్యారెట్ రకాలు కిలో రూ.100ల పైమాటే. రూ.100లు తీసుకెళితే కేవలం రెండు రకాల కూరగాయలు కూడా రావడంలేదని, పచ్చిడి మెతుకులే దిక్కయ్యాయని పలువురు వాపోతున్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ

● క్షేత్రస్థాయిలో ఆక్వా అథారిటీ, రెవెన్యూ పరిశీలన ● సబ్సిడీకి నిబంధనల అడ్డంకులు తొలగేనా...?

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులకు ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ పొందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అనే నిబంధన ఉంది. మంచినీటిలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా), ఉప్పునీటి ఆక్వా సాగు చేస్తున్న రైతులు కోస్టల్ ఆక్వా అథారిటీ(సీఏఏ) వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అయితే ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో సాగుచేసే వారు అనుమతి తీసుకోలేకపోయారు. ఇందుకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఈ నిబంధనలను కొంచెం మార్పు చేసి ఆక్వా సాగు చేపడుతున్న రైతులందరికీ రూ.1.50 యూనిట్ ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

● రాయితీకి నిబంధనలు అడ్డు

జిల్లాలో మత్స్యశాఖ లెక్కల ప్రకారం 39,590 ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. ఇందులో 1802 ఎకరాల్లో ఉప్పునీటి, 21538 ఎకరాల్లో మంచినీటి ఆక్వా సాగవుతోంది. అయితే ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూముల్లో కలిసి దాదాపుగా 60వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుందని అంచనా. విద్యుత్ రాయితీ ఇవ్వడానికి గత ప్రభుత్వం ఆక్వా, నాన్ ఆక్వా జోన్లని అడ్డగోలు నిబంధనలు తీసుకొచ్చింది. నాన్ ఆక్వా జోన్‌లో రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ అందలేదు. దీంతో యూనిట్‌కు దాదాపుగా రూ.6ల నుంచి రూ.8ల వరకు వసూలు చేశారు. దీంతో సాగుదారులు బాగా నష్టపోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం జోన్, నాన్ ఆక్వా జోన్ అనే పరిధి లేకుండా ప్రతి ఆక్వా రైతులకు రూ.1.50లకే విద్యుత్ అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి సీఏఏ, అప్సడా వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనే నిబంధనల తీసుకొచ్చింది.



● అడ్డంకులు తొలగేనా..?

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలతో కొంత మంది అర్హులకు విద్యుత్ రాయితీ అందడం లేదనేది తెలిసిన విషయం తెలిసిందే. సీఏఏ, అప్సడా నుంచి జిల్లాలో దాదాపు 50శాతం వరకు అనుమతి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన 50శాతంలో సాగు చేస్తున్న రైతులకు రిజిస్ట్రేషన్ కాలేదు. ఐదేళ్ల గడువు ముగిసిన కొందరు రైతులు రెన్యువల్ చేయించుకోకపోవడం ఒక కారణం. అదేవిధంగా ప్రభుత్వ, అసైన్డ్, డీకేటీ, అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు ఎలాంటి అనుమతులు లేవు. రైతులకు విద్యుత్ రాయితీ అందాలంటే వెబ్ ల్యాండ్‌లో కనిపించాలి. సాగు చేస్తున్న రైతు పేరుమీద విద్యుత్ బిల్లు ఉండాలి. కనీసం 1బి అడంగల్ ఉండాలి. కొన్ని గ్రామాల్లో సాగుదారుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో కనిపించడం లేదు. రీసర్వే చేసి సరిచేస్తామని చెబుతున్నారే తప్ప అడుగు ముందుకు పడడం లేదు. దీంతో అర్హులైన ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందడం లేదు. ఈ క్రమంలో నిబంధనలు సడలించే అవకాశం ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 600

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.11,273
వెండి కిలో ధర	రూ. 1,51,500
వెండి ఒక గ్రాము	రూ.155.50

నేరాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

● రౌడీషీటర్లకు రూరల్ ఎస్సై లక్ష్మణరావు సూచన

నెల్లూరు రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నెల్లూరు రూరల్ ఎస్సై లక్ష్మణరావు రౌడీషీటర్లకు సూచించారు. ఆదివారం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతీ రౌడీషీటర్‌పై పోలీసు నిఘా ఉందన్నారు. గొడవలు, హత్యలు, హత్యాయత్నాలు, ఇతర నేరాల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై ఏసీపీలు దృష్టిపెట్టలేదు

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని నూరు శాతం విజయవంతం చేయడంపై ఏసీపీలు దృష్టి పెట్టలేదని నగర కమిషనర్ నందన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం సిటీ ప్లానింగ్ విభాగంతో ఎన్‌ఎంసీలో సమీక్ష నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి అనధికార లేఅవుట్ల వివరాలు తీసుకుని వాటన్నిటిని క్రమబద్ధీకరించాలని సూచించారు. సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలు సంబంధి గడువు ముగిసినా కూడా ఎందుకు దరఖాస్తులు క్లోజ్ చేయలేదని ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలు కోసం నియమించిన ప్రత్యేక సిబ్బంది చురుగ్గా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీ హిమబిందు, డీసీపీ రఘునాథరావు, ఏసీపీలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్ క్రీడాకారులకు అభినందనలు

నెల్లూరు(విద్య), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ రేటింగ్‌లు సాధించారని ఏపీ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్ తెలిపారు. నగరంలోని గోమతినగర్ ఆర్ ఎల్ చెస్ అకాడమీలో ఆదివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెన్నై, విజయవాడల్లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ టోర్నమెంట్స్‌లో జిల్లాకు చెందిన మండల ఆదిత్య హనుమ, దక్షిత, పసుపులేటి దీక్షితారావు, అర్జున్‌రెడ్డి అంతర్జాతీయ చెస్ సమాఖ్య ప్రచురించిన రేటింగ్ జాబితాలో చోటు సంపాదించారన్నారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ రేటింగ్ సాధించిన చిన్నారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్ర ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలన్నారు. అనంతరం క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోచ్‌లు రామ్, లక్షణ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నెల్లూరు రెండవ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సోమవారం డయల్ యువర్ డీఎం కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ కరిముస్నీసా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225642 నెంబరుకు మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య ఫోన్ చేసి వారి సూచనలు అందించాలని కోరారు.

తూర్పు గేటు... తెరుచుకోదు!

● కలెక్టరేట్‌కు ఆచారివీధి వైపు దారి మూసివేత ● ఇబ్బంది పడుతున్న సందర్శకులు



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిపాలనా కేంద్రమైన కలెక్టరేట్‌కు తూర్పు వైపు ద్వారం మూసి వేయడంతో సందర్శకులు ఇబంది పడుతున్నారు. ఆచారి వీధి నుంచి కలెక్టరేట్‌లోకి ప్రజల రాకపోకలకు ఉద్దేశించి బ్రిటీష్ వారి కాలంలో ఏర్పాటు చేసిన గేటును ఇటీవల అధికారులు మూసేశారు. ఆ గేటుకు పైభాగంలో ప్లైవుడ్‌తో నెట్టుడు తలుపును ఏర్పాటు చేసి, దానికి కూడా తాళం వేశారు. నగరంలో గాంధీబొమ్మ వైపు నుంచి కలెక్టరేట్‌కు వచ్చే జనం ఆచారివీధి మార్గం గుండానే ఎక్కువగా కలెక్టరేట్ లోకి వస్తుంటారు. అలాంటి వారికి ఈ తూర్పు ద్వారం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గతంలోనూ ఆ గేటుకు ఎప్పుడూ తాళం వేసి ఉన్నప్పటికీ మనిషి దూరి వెళ్లేంత స్థలం ఉండేది. దాని ద్వారా సందర్శకులు, ఉద్యోగులు రాకపోకలు సాగించేవారు. అయితే ఆ గేటును ప్రస్తుతం పూర్తిగా మూసివేయటంతో చుట్టూ తిరిగి కలెక్టరేట్‌లోకి వెళ్లవలసి వస్తోంది. దీంతో వారు అసౌకర్యానికి గురవుతు న్నారు. సోమవారం రోజు అర్జీదారుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అలాంటి సందర్భంలోనైనా తూర్పు గేటును తెరవాలని అర్జీదారులు కోరుతున్నారు.

మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● నగర మహాసభలో అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్



మాట్లాడుతున్న అవాజ్ కార్యదర్శి రషీద్

నెల్లూరు (వైద్యం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అవాజ్ జిల్లా కమటీ కార్యదర్శి షేక్ రషీద్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని టిడ్కో గృహాల సముదాయం వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్‌లో అవాజ్ నగర మహాసభ జరిగింది. రషీద్ మాట్లాడుతూ 2022 నుంచి అవాజ్ కమిటీ మైనార్టీ హక్కుల కోసం పోరాడుతోంద న్నారు. జాతీయ స్థాయిలో మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలను కలుపుకుని పోతున్నామని చెప్పారు. కూటమి ప్రభు త్వం రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మైనార్టీలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చలేదన్నారు. 50 ఏళ్లకు పెన్షన్, దుల్హన్ పథకం అమలు, ఇమామ్, మౌజర్లకు గౌరవవేతనాలు ఇవ్వటంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. అనంతరం 13 మందితో అవాజ్ నూతన కమిటీ ఎంపికైంది. కార్యక్రమంలో రియాజ్, కోశాధికారి షేక్ చాన్‌బాషా, నాగేశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రమణ్యంను ఆదివారం నగరంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకుడు వల్లూరు వేణుగోపాల్ మాట్లాడుతూ కట్టా సుబ్రమణ్యం భవిష్యత్తులో కార్మికుల సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ రహంతుల్లా, యు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న నాయకులు

అండర్‌పాస్‌కు నిధుల మంజూరుకు మంత్రి సమ్మతి

నెల్లూరు (వైద్యం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చింతారెడ్డిపాళెం కూడలిలో జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు మున్సిపల్ మంత్రి నారాయణ చెప్పారని, ఇది ఎంతో శుభపరిణామని అండర్ పాస్ సాధన కమిటీ కన్వీనర్ కాయం శ్రీనివాసులు వెల్లడించారు. ఆదివారం జాతీయ రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జి కోసం నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో సాధన కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈ నెల 16వ తేదీన మానవహారం నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధాకర్, ప్రసాద్, ఎం నారాయణ, సంపూర్ణమ్మ, కట్టా సతీష్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో

వేదగిరిని మరింత అభివృద్ధి చేస్తాం

● నూతన పాలక మండలి అభినందన సభలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



ఆలయ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన వేదగిరి నృసింహ క్షేత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ నూతన పాలక మండలి అభినందన సభను వేదగిరి క్షేత్రంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ ప్రసాదం స్కీం నిధులు క్షేత్రానికి రానున్నాయని తెలిపారు. దీంతో ఆలయ దిశ, దశ మారబోతోందని చెప్పారు. వీటితోపాటు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. ఈ నిధులతో వేదగిరి క్షేత్రాన్ని అత్యంత ఆధ్యాత్మిక, పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన పాలక మండలి భక్తుల మన్ననలు పొందాలని సూచించారు. పొట్టేపాళెం వద్ద కలుజు పై వంతెన నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు అతి త్వరలో ఖరారు కానున్నాయని ప్రకటించారు. డిసెంబరులో శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. అటు ములుముడి వద్ద వంతెన నిర్మాణానికి కూడా తీవ్రంగా కృషి చేస్తున్నామని చెప్పారు. మాదరాజు గూడూరు - కలివెలపాళెం రోడ్డు పనులకు టెండర్లు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నూతన చైర్మన్ అచ్యుత్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ విజయకుమార్, మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ. 15 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ పంపిణీ

నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని 21 కుటుంబాలకు రూ. 15 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందచేశామని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో బాధిత కుటుంబాలకు ఆదివారం చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందినవారు, ఇతర రాష్ట్రాల్లో వైద్యం చేయించుకున్న వారికి ఈ నిధి ఓ వరంలాంటిదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వైద్య పరీక్షలు

నెల్లూరు(విద్య), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టేడియంలో వాకింగ్‌కు హాజరయ్యే వారితో పాటు క్రీడాకారులు బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులు వినియోగించాలి : బీజేపీ



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(క్రైం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా దేశ ఆర్థిక శక్తి బలోపేతం అవుతుందని బీజేపీ నాయకుడు పీ సురేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. నగరం లోని మూలాపేటలో స్వదేశీ వస్తువుల కొనుగోలుపై ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో అభివృద్ధి పనులు

బెజవాడ వంశీకృష్ణారెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ఊటుకూరు గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని టీడీపీ యువ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. కంచరపాళెం నుంచి పెద్దపాళెం వరకు నిర్మించిన సీసీరోడ్డు, పల్లిపాళెంలో నూతనంగా నిర్మించిన వంతెన, పెన్నా పొర్లు కట్టలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ పెన్నా నదికి వరదలు వస్తే లోతట్టు గ్రామమైన ఊటుకూరు నీటి మునిగి ప్రజలు నానా ఇబ్బందులు పడేవారన్నారు. అంతేకాకుండా రోడ్లు దెబ్బతినటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడేదన్నారు. గ్రామస్థుల కష్టాలను తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో గ్రామంలో సుమారు రూ. 1.30 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ ప్రదీప్‌రెడ్డి, రాజేష్, శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంతో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు నారాయణ, రెడ్‌క్రాస్ ఏఆర్‌వీ కమిటీ సభ్యులు రాజగోపాల్ రెడ్డి, మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి కమిటీ సభ్యులు గంపల మంజుల, మన్నె చంద్రశేఖర్‌రెడ్డి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూల ధరలకు రెక్కలు

- పెరిగిన వినియోగం
- శుభకార్యాలకు అవసరం
- కార్తీకం పూర్తయ్యేవరకు ఇదే పరిస్థితి
- మండలకేంద్రాల్లో అదనపు ధరలు



పొదలకూరులో ఓ పూల దుకాణం

పొదలకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం నేపథ్యంలో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఈనెల 22 వరకు కార్తీక మాస పూజలు కొనసాగుతాయి. అప్పటివరకు ధరలు తగ్గేలా లేవంటున్నారు. ఆలయాల్లో ఒక్కో రకం పూలతో భక్తులు అభిషేకిస్తుంటారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర పూజా కార్యక్రమాలకు అవసరమవుతాయి. శ్రావణ మాసం నుంచి పెళ్లిళ్లు ప్రారంభమవడంతో పూల ధరలు దిగిరావడం లేదు.

● **పెరిగిన ధరలు...**

కార్తీక మాసంలో ఇష్టానుసారం పూల ధరలు పెరిగాయి. మరోవైపు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. జిల్లా కేంద్రం నెల్లూరులో మోస్తరుగా ధరలుంటే మండల కేంద్రాల్లో ధరలు అమాంతం పెంచేసి అమ్ముతున్నారు. ధరలపై ఆంక్షలు లేకపోవడంతో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు విక్రయిస్తున్నారు. పొదలకూరు పంచాయతీ బస్టాండులో దుకాణాలు చాలానే ఉన్నాయి. నిత్యం వ్యాపారులు పోటీపడి అమ్మకాలు లేకపోవడంతో ఎవరిష్టం వచ్చినట్లు వారు విక్రయిస్తున్నారు. విడిపూలు, మాలలు అమ్మడంతో పాటు కొందరు ప్రత్యేక కార్యక్రమాలకు పూల అలంకరణలకు కూడా వెళుతుంటారు. వివాహాల్లో డెకరేషన్ ప్రత్యేకత ఉంటుంది. దీనికి మండపాల యజమానులు అధిక మొత్తంలో తీసుకుంటారు. ఫలితంగా పూల ధరలు మరింత పెరుగుతున్నాయి. సాధారణంగా పూల సాగును చిన్న కమతాల్లోనే రైతులు చేస్తుంటారు. ఎకరాల మేర సాగు చేసే వారు పెద్దగా ఉండరు. పందిళ్లు, పూల మొక్కల రక్షణ కోసం పాలీహౌస్ నిర్మాణం వ్యయంతో కూడుకున్న పని కావడంతో ఆసక్తి చూపరు. అయితే చెన్నై, బెంగళూరు నుంచి పూలు దిగుమతి అవుతున్న నేపథ్యంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

● **మండల కేంద్రంలో ధరలు (కిలో)...**

చామంతి రూ.400, బంతిపూలు రూ.150, రోజా పూలు రూ. 350, మల్లెపూలు రూ.1500, కనకాంబరం రూ. 1500, సంపంగి రూ. 200, కాగడాలు రూ.800 సెంటిజాజులు రూ.1600.

పెట్రోలు బంకును ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి



ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

పొదలకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపూరు గ్రామం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డికి గ్రామ నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, కలిచేటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ పెట్రోలు బంకు వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, కండే నరసయ్య, గ్రామ నాయకులు బత్తల శేషరెడ్డి, బత్తల హరేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గుర్రం మీరా, మధు, పిన్నెల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

రాపూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాపూరు పట్టణంలో వెలసిన మహా విష్ణువు, అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం 25వ రోజు మాలధా రులకు అన్నదానం చేశారు. తేజ్ స్వరూప్, సాగందిక దంపతులు, గంగి శెట్టి వంశీ, శ్రీదేవి దంపతులు, పాలవల్లి గోపీచంద్, ముకుంద సాయి ఉభయ దాతలుగా వ్యవ హరించారు. ఉదయం స్వామి వార్లకు అభి షేకాలు, గణపతి హోమం, గోత్ర నామాలు, విశేష పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయ రహదారిపై స్పెషల్ డ్రైవ్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మనుబోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల జాతీయ రహదారిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్‌ఐ. శివరాకేష్ ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నెల్లూరు నుంచి గూడూరు మార్గంలో వెళుతున్న వాహనాలను నిలిపి తనిఖీలు నిర్వహించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపుతూ పరీక్షల్లో పట్టుబడిన పలువురికి పోలీసులు జరిమానాలు విధించారు.

వైఖానస సంక్షేమ సంఘ వన సమారాధన



శ్రీకోదండరామస్వామి ఆలయంలో పల్లకీసేవ

కోవూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వైఖానస సంక్షేమ సంఘ వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూలంగిసేవ, పల్లకీసేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవరావు, జిల్లా పురోహిత సంఘ అధ్యక్షుడు పారా శ్రీధరశర్మ, వైఖానస సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అలహరి లక్ష్మీనారాయణాచార్యులు, కార్యద ర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు, కోశాధికారి పరాంకుశం అనంతపద్మనాభాచార్యులు, వీరాంజనేయ స్వామి ఆలయ అర్చకులు జనార్ధనం నాగరాజాచార్యులు, పరాంకుశం శ్రీకాంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మనుబోలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామపురంలోని సీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పడిపూజ కోసం ప్రత్యేకంగా అంబళంను అలంకరించారు. ఈ పూజలో మనుబోలుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిమంది అయ్యప్ప భక్తులు వచ్చి నృత్యాలతో కూడిన భజన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఉత్సవమూర్తికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు మాధవ్ స్వామి భిక్ష ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా హాజిరా ఎంపిక



ఉదయగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హాజిరా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రతి ఏటా నవంబరు 11న మౌలానా అబుల్‌కలాంఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరిస్తోంది. మంగళవారం విజయవాడలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ సభలో హాజిరా ఈ అవార్డు అందుకోనున్నారు. రాష్ట్రస్థాయి అవార్డు పొందిన హాజిరాకు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కలుగోళ్ల శాంభవికి బంగారు ఆభరణాల వితరణ



కలుగోళ్ల శాంభవి ఆలయ ఈవోకు బంగారు ఆభరణాలు అందజేస్తున్న భక్తురాలు క్రిష్ణకుమారి

కావలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కావలి గ్రామ దేవత కలుగోళ్లశాంభవికి బెంగళూరు వాసి మాగాటి క్రిష్ణకుమారి రూ.5లక్షలు విలువ చేసే 40 గ్రాముల బంగారు ఆభరణాలను బహూకరించారు. బంగారు కళ్లు, బులాకీ, తిలకం తదితర ఆభరణాలను ఆదివారం ఈవో అరవ రాధాక్రిష్ణకు అందజేశారు. అందుకు దాతకు ఆలయ ఈవో ధ్రువీకరణ పత్రం అందజేశారు. దానిని ఫ్రేమ్ కట్టించుకుని అమ్మవారి జ్ఞాపకార్థంగా తమ వద్ద ఉంచుకుంటామని ఆమె చెప్పారు. అమ్మవారి దయవలన తాము అనుకున్న కోరికలు నెరవేరాయని, ఆ ఆనందంతో కానుకలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి దేవరాల సురేష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైతులకు తగినంత యూరియా అందించాలి

నెల్లూరు (వైద్యం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో 8 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారని, దీనికి అనుగుణంగా రైతులకు తగినంత యూరియాను అందించాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షుడు మూల వెంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్ మాట్లాడారు. జిల్లాలో సమృద్ధిగా సాగునీరు ఉన్నా యూరియా కొరత ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం ఎకరాకు 3 యూరియా బస్తాలు ఇస్తామని చెబుతోందని కనీసం 5 బస్తాల అవసరం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో రైతు సంఘం కార్యదర్శులు శ్రీరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నెరవేరేనా?

● నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం

● పుట్టినబిడ్డ నుంచి వ్యాధి నిరోధక టీకా వేయాలి
● పలు వ్యాధుల నివారణలో ఇవే కీలకం
● అమలుపై గతంలో అలక్ష్యం
● ప్రస్తుతం విస్తృత ప్రచారం అవసరం



నెల్లూరు (వైద్యం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తిం చాలి. పుట్టిన చిన్నారికి ఎప్పుడెప్పుడు ఈ టీకాలు వేయాలి... ఎలా వేయించాలి...? అనేది తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి. ఆదిశగా వైద్యాధికారులు, సిబ్బం ది జిల్లాలో విస్తృత ప్రచారం చేయాలి. అప్పుడే ఈ వ్యాధినిరోధక టీకాలు లక్ష్యాలు నెరవేరతాయి. టీకాల పై ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అవయవలోపాలతోపా టు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. వ్యాధి నిరోధక టీకాల అమలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏటా నవంబరు 10న (నేడు) ప్రపంచ వ్యాధి నివా రణ టీకాల దినోత్సవాన్ని జరుపుకోవాలని తీర్మానిం చింది. తద్వారా ప్రజల్లో టీకాల ప్రాధాన్యతపై తెలియ చేసి, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించుకు నేలా అవగాహన కలిగించాలని పిలుపు నిచ్చింది.

ప్రతీ చిన్నారికి టీకాలు వేయించాలి

ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. జిల్లాలో ప్రతీ చిన్నారికి ఎనిమిది రకాల టీకాలు వేసేందుకు కృషి చేస్తున్నాం. ఎక్కడెక్కడ చిన్నారులు ఉన్నారో గుర్తించి టీకాలు వేస్తున్నాం. అలాగే వ్యాధి నిరోధక టీకాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.



- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

● **అమలులో నిర్లక్ష్యం**

అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్నారులకు వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి. గతంలో జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల అమలులో పూర్తిస్థాయి నిర్లక్ష్యం తాండవించింది. అయితే గత ఏడాది వ్యాధి నిరోధక టీకాల లక్షాలు పూర్తి చేయటంలో అధికారులు కొంత శ్రద్ధ పెట్టారు. 3.26 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏటా లక్షలు ఖర్చుచేస్తున్నారు. మిగిలిన వ్యాధినిరోధక టీకాలపై మాత్రం పూర్తి శ్రద్ధ కనబరచడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ప్రాణాంతక వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఏటా రూ.60 లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితాలు ఆశాజనకంగా లేవన్న విమర్శలు ఉన్నాయి.

● **ప్రచారమేదీ..?**

చిన్నారి జన్మించినప్పటి నుంచి 60 నెలల వరకు పోలియో చుక్కలతో పాటు క్షయ, మసూచి, ధనుర్వాతం, కోరింతదగ్గు, కంఠసర్పిలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వీటి అమలుకు జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 28 యూ పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, నెల్లూరులో జీజీహెచ్ ఉన్నాయి.ఆయా కేంద్రాల పరిధి లోనూ ప్రతి బుధ, శనివారాల్లో గ్రామాల్లో తిరిగి గుర్తించిన పిల్లలకు టీకాలు వేయాలి. ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు దాదాపు వేయి మందికిపైగా టీకాల పంపిణీ చేపట్టాల్సి ఉంది. అయితే వైద్య సిబ్బందిని ర్లక్ష్యం కారణంగా టీకాల అమలుపై పలు సందేహాలు రేకెత్తుతున్నాయి. కేవలం కొన్ని సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు మాత్రం నిర్వహిస్తున్నారే కానీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇంకా పూర్తి అవగాహన కల్పించడం లేదు.

టీకాలు ఇలా వేయించాలి

- చిన్నారి పుట్టిన వెంటనే క్షయ వ్యాధి రాకుండా బీసీజీ వ్యాక్సిన్ వేయాలి.
- పోలియో వ్యాధి రాకుండా పోలియో వ్యాక్సిన్
- జాండీస్ రాకుండా హెపటైటిస్ బీ వ్యాక్సిన్
- పుట్టిన ఒకటిన్నర, రెండున్నర, మూడున్నర నెలల తర్వాత మరోసారి పోలియో చుక్కలు వేయించాలి.
- కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం రాకుండా 45,75,105 రోజుల వ్యవధిలో డీపీటీ వ్యాక్సిన్ వేయాలి.
- 9వ నెల వచ్చాక తట్టు, అమ్మవారు రాకుండా మీజల్స్ వేయించాలి.
- ఒకటిన్నర, రెండున్నర, మూడున్నర నెలల్లో మరోసారి హెపటైటిస్-బీ వ్యాక్సిన్ వేయించాలి.
- కంటి వ్యాధులు రాకుండా విటమిన్-ఏ వ్యాక్సిన్ వేయించాలి.
- మెదడువాపు వ్యాధి రాకుండా జేఈ వ్యాక్సిన్ వేయించాలి.
- 18 నెలల తరువాత డీపీటీ, పోలియో, మీజల్స్, జేఈ, విటమిన్ ఏ వ్యాక్సిన్ వేయించాలి.
- 24 నుంచి 60 నెలల్లోపు చిన్నారులకు విటమిన్-ఏ, డీపీటీ వ్యాక్సిన్ వేయాలి.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం : ఆరుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా పలాసా నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తీసుకువచ్చి నెల్లూరులో విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు లాడ్జీలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య తన సిబ్బందితో కలిసి నగరంలోని బృందావనంలో ఉన్న రాజేష్ లాడ్జీలో తనిఖీలు చేపట్టారు. ఓ గదిలో అనుమానాస్పదంగా ఉన్న నగరానికి చెందిన జగదీష్‌కుమార్, మునిరాజేష్, శ్యాంసుందర్, సంతోష్, అభిషేక్, సాయిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగ్‌లో ఆరు కిలోల గంజాయిని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా నిందితులు వివరాలు వెల్లడించారు. పలాసాలో కేజీ రూ.5వేలు చొప్పున కొనుగోలు చేసి నెల్లూరులో రూ.20వేలు చొప్పున విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమం ఉధృతం

● 13న ఉదయగిరిలో భారీ ర్యాలీ, బహిరంగసభ ● జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కే వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో ఉద్యమ కమిటీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉదయగిరిని జిల్లా చేయాలని ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. తొలుత ఉదయగిరి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైతే ఆ తర్వాత జిల్లాగా అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి, పాలకులకు సూచించామన్నారు. ఈనెల 13న ర్యాలీ, స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు దస్తగిరి అహ్మద్, ఖాదర్‌బాషా, రామిరెడ్డి, రంతుజాని, ఎస్థాని, ఖాజా, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సోమిరెడ్డి, జాషువా, షంషీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్

జూద స్థావరాలపై పోలీసుల దాడులు

ఉదయగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి స ర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట, కో డిపందేల స్థావరాలపై ఆదివారం సీఐ ఎన్ వెంకటరావు సి బ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వరికుంటపాడు మండలం కృష్ణంపల్లిరాజుపల్లి గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురు జూదరులు, నాలుగు కోళ్లు, మూడు బైక్‌లు, రూ.5 వే లు నగదు స్వాధీనం చేసుకున్నారు. యర్రంరెడ్డిపల్లి సమీపం లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుమంది పేకాటరాయుళ్లు, రూ.5,100 నగదు, దుత్తలూరు బీసీ కాలనీలో నలుగురు పేకాటరాయుళ్లు, రూ.6 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆదిలక్ష్మి, రఘునాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెయిలింగ్ లేని వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం

● 15 అడుగులకు పైగా కాలువ లోతు..
● చోద్యం చూస్తున్న అధికారులు



పూర్తిగా దెబ్బతిన్న నెల్లూరు చెరువు కాలువ పాత వంతెన రెయిలింగ్

సంగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంగం ఆనకట్టకు దక్షిణవైపు ఉన్న పాత నెల్లూరు చె రువు కాలువ వంతెన రెయిలింగ్ పూర్తిగా దె బ్బతినింది. ప్రమాద కరంగా ఉన్న ఏక వరుస వంతెనపై రాక పోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. సంగం పాత ఆనకట్టకు దక్షిణ వైపు నెల్లూరు చెరువు కా లువ ప్రారంభమవుతోంది. ఈ కాలువకు పె న్నానది నుంచి నీటిని విడుదల చేసేందుకు రెగ్యులేటర్లు ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ కాలు వపై నిర్మించిన ఏక వరుస వంతెన దాటి చేజ ర్ల, పొదలకూరు మండలాల్లోని కొన్ని గ్రా మాలకు వెళ్లాల్సి ఉంది. సంగం ఆనకట్ట ని ర్మించినప్పుడే ఈ వంతెన నిర్మించి రెగ్యులేటర్లు ఏర్పాటు చేశారు. ఇది నిర్మించి సుమారు 130 ఏళ్లు దాటింది. దీంతో ఆనకట్టతో పాటే వంతెన కూడా శిథిలస్థితికి చేరింది. దీంతో రెయిలింగ్ పూర్తిగా దెబ్బతినింది.

● **2022లో నూతన బ్యారేజీ ప్రారంభం**

శిథిలమైన ఆనకట్ట స్థానంలో నిర్మించిన సంగం బ్యారేజీని 2022లో ప్రారంభించడంతో వినియోగంలోకి వచ్చింది. బ్యారేజీతోపాటు నెల్లూరు చెరువుకు నూతన కాలువను నిర్మించారు. దీంతో పాత కాలువను మూసేశారు. అయితే ఈ కాలువపై ఉన్న ఏక వరుస వంతెన సంగం వైపు నుంచి చేజర్ల, పొదలకూరు మండలాల్లోని సూరాయపాళెం, నేదురుపల్లి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఏకైక రహదారి.

● **శిథిలమైన వంతెన రెయిలింగ్**

వంతెన నిర్మించి వందేళ్లు దాటడంతో ఏక వరుస వంతెన రెయిలింగ్ శిథిలమైంది. రెగ్యులేటర్ల వైపు ఉన్న రెయిలింగ్ కూడా దెబ్బ తినడంతో వంతెన మీద ఉన్న సందుల్లో మోటారు బైక్‌లు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతోన్నాయి.

● **చోద్యం చూస్తున్న అధికారులు**

రెండు మండలాల్లోని గ్రామాలకు కీలక మార్గంలో ఉన్న వంతెన రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నా ఇరిగేషన్ అధికారులు ప ట్టించుకోవడంలేదు. తరుచూ ప్రమాదాలు జరు గుతున్నా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెయిలింగ్ పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దివ్యాంగులూ.. ఉచిత త్రీ వీలర్ వాహనాలకు దరఖాస్తు చేసుకోండి

● ఉచితంగా ఆన్‌లైన్‌లో స్వీకరణ

చేజర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి). రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిట్ త్రీ వీలర్ మోటారు వాహనాలు అందించేందుకు రాష్ట్రం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పదవ తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధి లేదా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నడవడానికి కాళ్లు సహకరించక వారు పడుతున్న బాధను తొలగించి నూతనోత్సాహం నింపేందుకు అర్హులైన దివ్యాంగులకు త్రీ వీలర్ మోటారు వాహనాలను ఉచితంగా అందజేయనున్నది. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు కూడా వీటిని పొందవచ్చు. ఈ నెల 25 లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏపిడిఏఎస్‌సిఏసి.ఏపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హతలు ఇవీ..

- ఒకటి లేదా రెండు కాళ్లు ప్రభావితమై 70 శాతం వైకల్యం ఉన్నవారు.
- రెండు చేతులు సక్రమంగా ఉండాలి.
- 18 సంవత్సరాలు నిండి 45 ఏళ్లలోపు వయస్సు ఉండాలి.
- తెల్ల రేషను కార్డు తప్పనిసరి
- ఆధార్, రేషన్ కార్డు, 10వ తరగతి మార్కులు లిస్ట్, వైకల్యానికి సంబంధించి సదరం సర్టిఫికెట్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ లేదా ప్రస్తుతం అందుతున్న పెన్షన్ పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, స్వమం ఉపాధి లేదా ప్రైవేటు ఉద్యోగికి సంభందించన ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, అంగవైకల్యం చూపే విధంగా ఉన్న ఫొటోను జత చేస్తూ సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం అందజేస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలి.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన సంఘటనల్లో నలుగురు మృతి చెందారు. జంగాలపల్లెలో పురుగు మందు తాగి వృద్ధురాలు, జలదంకిలో మూర్ఛతో యువరైతు, కోవూరు ఇంటి శ్లాబు కూలి కార్పెంటర్, బిట్రగుంటలో కారు ఢీకొని మోటారు సైక్లిస్టు దుర్మరణం చెందారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

● **పురుగు మందు తాగి వృద్ధురాలు..**

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతజంగాలపల్లికి చెందిన హజరత్తమ్మ(65) అనే వృద్ధురాలు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. మూడేళ్లగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న ఆమె ఇటీవల నొప్పులు ఎక్కువ కావడంతో భరించలేక పంటల కోసం తెచ్చి ఇంట్లో ఉంచిన పురుగు మందును శనివారం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడతో మెరుగైన వైద్యం కోసం ఓ నెల్లూరలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చెందింది. ఆమె భర్త పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● **పొలంలోనే యువ రైతు...**

జలదంకి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని టీకే.అగ్రహారానికి చెందిన యువరైతు షేక్ అలీ(32) వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లి ఫిట్స్ రావడంతో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. అలీ పొలం పనులకు వెళ్లి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా పొలంలో శవమై కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పరిశీలించిన ఎస్‌ఐ లతీఫున్నీసా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ యజమాని మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగింది.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లతీఫున్నీసా

● **ఇంటి శ్లాబు కూలి కార్పెంటరు...**

కోవూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి శ్లాబు కూలడంతో ఆదివారం ఓ వడ్రంగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కోవూరు పట్టణంలోని లక్ష్మీనగర్‌లో నివాసముండే వేమయ్య కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. శ్లాబు పనులు పూర్తయ్యాక, ఇంటిలో అల్మారా చేయించేందుకు నెల్లూరు సంతపేటకు చెందిన కార్పెంటరు పట్నం ప్రసాద్ (48)తో యజమాని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆదివారం ప్రసాద్ అల్మారా పనులు చేస్తుండగా శ్లాబు ఒక్కసారిగా కూలిపోయింది. పెద్ద సిమెంటు పెళ్ళ పడటంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పట్నం ప్రసాద్ మృతదేహం

● **కారు ఢీకొని మోటారు సైక్లిస్టు...**

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారిపై కారు ఢీకొనడంతో మోటర్‌సైకిలిస్ట్ అనపల్లి మాల్యాద్రి (77) ఆదివారం అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు... కావలి మండలం తాళ్లపాలెం పంచాయతీ లింగంగుంటకు చెందిన మాల్యాద్రి టీవీఎక్స్‌పై కొండబిట్రగుంటకు బయలుదేరాడు. ముంగమూరు కూడలి క్రాస్‌రోడ్డు దాటి వెళుతుండగా నెల్లూరు నుంచి కావలి వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో మాల్యాద్రి మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆయన కుమారుడు అనపల్లి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రభాకర్

పెట్రోల్ బంకు సిబ్బందికి యువకుడి బురిడీ

● రూ. 50వేలు, స్వైపింగ్ మిషన్ చోరీ

సంగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సంగంలోని ముంబై రహదారి కూడలిలో ఉన్న ఓ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సిబ్బందిని ఓ యువకుడు బురిడీ కొట్టించి రూ. 50 వేలతోపాటు స్వైపింగ్ మిషన్ చోరీ చేశాడు. వివరాల మేరకు.. శనివారం రాత్రి ఓ గుర్తు తెలియని యువకుడు ముంబై రహదారి కూడలిలోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్దకు వచ్చి తనకు రూ.50 వేల క్యాస్ అవసరమని, తన ఏటీఎం కార్డు ద్వారా స్వైపింగ్ మిషన్‌కు స్వైపింగ్ చేయాలని కోరాడు. అందుకు కమీషన్ ఇస్తాననడంతో సిబ్బంది ఒప్పుకోవడంతో యువకుడు తన వద్ద ఉన్న ఏటీఎం కార్డుతో పెట్రోలు బంకులోని స్వైపింగ్ మిషన్ ద్వారా స్వైపింగ్ చేశారు. రూ. 50 వేలు బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో సిబ్బంది కమీషన్ పట్టుకుని మిగతా నగదు యువకుడికి ఇచ్చారు. ఆ తరువాత సెల్‌ఫోన్ చార్జింగ్ పేరుతో పెట్రోల్ బంకు క్యాబిన్‌లోకి వెళ్లి సిబ్బందిని ఆదమరిపించి స్వైపింగ్ మిషన్‌ను ఎత్తుకెళ్లాడు. కొంత సేపటికి స్వైపింగ్ మిషన్ చోరీని గుర్తించిన సిబ్బంది పెట్రోల్ బంకు యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన బ్యాంకు ఖాతాను లాక్ చేయడానికి బ్యాంకు అధికారులను ఫోన్‌లో సంప్రదించగా అప్పటికే రూ.50 వేలు స్వైపింగ్ మిషన్ నుంచి రీఫండ్ చేసినట్లు చెప్పడంతో ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో సోమవారం జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ స్థితి ఇతర వివరాల కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

గుండె నిండా ఆత్మస్థైర్యం..బండనైనా చీల్చే మహా సంకల్పం!

నొప్పి లేని నిమిషమేది.. జననమైన మరణమైన...
జీవితాన అడుగు అడుగునా..!
నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీది కాదు...
బతుకు అంటే నిత్య ఘర్షణ!
దేహముంది.. ప్రాణముంది... నెత్తురుంది.. సత్తువుంది..
ఇంతకన్నా సైన్యముండునా?

- అంటారు సినీకవి సిరివెన్నెల.

నిజమే.. 'ఆశ' మనిషిని బతికిస్తుంది. 'ఆశయం' పది కాలాలపాటు జీవించే ఆత్మస్థైర్యాన్ని ప్రసాదిస్తుంది. మౌనంగా ఎదిగే మొక్క.. మహా సంకల్పంతో ముందుకు సాగే యోధుడిలో నిత్యస్ఫూర్తిని రగిలిస్తుంది. ఉదయగిరి మండలంలోని కొండాయపాళెం పంచాయతీ దుర్గంపల్లి సమీపంలో చెక్‌డ్యాం వద్ద నల్లబండ మధ్యలోనుంచీ పెరుగుతున్న ఓ చెట్టు ఇందుకు నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తోంది. మనిషి మహా సంకల్పంతో ప్రయత్నిస్తే ఎంత గొప్ప కార్యమైనా సాధించవచ్చనేందుకు.. వేర్లతో సహా బండను చీల్చుకుని బలంగా ఎదుగుతున్న ఈ మొక్కే... తిరుగులేని ఉదాహరణ. స్థానికులతో పాటు దుర్గంను సందర్శించే పర్యాటకులు ఈ వృక్షాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు)

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



బండను చీల్చుకొని బయటకు వచ్చిన వేర్లు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252
కోడిగుడ్ల ధర (100)	600

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.11,520
వెండి కిలో ధర	రూ. 1,51,600
వెండి ఒక గ్రాము	రూ.157.60

క్రీడాకారులను ప్రోత్సహించాలి

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి క్రీడాకారుడికైనా ప్రోత్సాహం ఉంటేనే ముందుకు వెళ్లేందుకు దోహదపడుతుందని బీఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు సమీఉల్లా అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలోని తైక్వాండో వాకర్స్ సభ్యులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన ఇంటర్‌నేషనల్ మాస్టర్ ఈ.రవిగన్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.బర్నాడ్, సభ్యులు కే.శ్రీనివాసులు, సత్యనారాయణ, ఎం.శ్రీనివాసులు, బీ.సుధాకర్, ఆర్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నీరు తాగేదెలా..?

- రాళ్లపాడు-రోళ్లపాడు తాగునీటి పథకం నుంచి రంగుమారిన నీరు సరఫరా
- కలుషిత నీటితో ప్రజల భయాందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రాళ్లపాడు-రోళ్లపాడు తాగునీటి పథకం నుంచి సరఫరా జరిగిన రంగుమారిన నీరు

వలేటివారిపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రోళ్లపాడు రక్షిత తాగునీటి పథకం నుంచి రంగుమారిన కలుషిత నీరు సరఫరా జరుగుతుంది. వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలలోని 38 గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సుమారు రూ.4 కోట్లతో రాళ్లపాడు-రోళ్లపాడు రక్షిత మంచినీటి పథకం ప్రారంభించారు. అప్పట్లో ఈ పథకం ప్రజలకు బాగా ఉపయోగపడింది. తదనంతరం పథకం నిర్వాహణ లోపంతో సక్రమంగా పనిచేయడం లేదు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. గత నెల రోజుల క్రితం ప్రజలు, ప్రజాప్రతినిధులు తాగునీరు కలుషింపై అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో క్లోరినేషన్ చేయాలనే ఉద్దేశ్యంతో అధికారులు పది రోజుల పాటు తాగునీరు సరఫరా నిలిపివేశారు. అయితే క్లోరినేషన్‌కు ముందు తాగునీరు పసుపు రంగులో వచ్చేది. క్లోరినేషన్ చేసిన తరువాత ఎర్రగా సరఫరా అవుతుంది. ఆ తాగునీరు చూసి ప్రజలు ఈ నీరు తాగేదెలా అని ప్రశ్నిస్తున్నారు. ఈ రంగుమారిన కలుషిత నీరు తాగితే రోగాలు బారిన పడడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. కనీసం పశవులు కూడా తాగనంతగా కలుషిత నీరు సరఫరా అవుతుంది. తాగునీటి పథకం నిర్వాహణంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత రెండు నెలలుగా కుళాయిల్లో పసుపు, ఎరుపు రంగు, దురర్వాసనతో కూడిన కలుషిత నీరు సరఫరా అవుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వానికి ఫ్యాప్టో కృతజ్ఞతలు

కావలి(టౌన్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కోరుతూ రాష్ట్రప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయడం పట్ల ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు కంచర్ల మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని ఆదావారం ఆయన నివాసంలో కలిసి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. చట్టంలో మార్పు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయవల్సిందిగా ఎమ్మెల్యే ద్వారా రాష్ట్రప్రభుత్వానికి అభ్యర్థించారు. విద్యాశాఖలోని కొంత మంది వివిధ స్థాయి అధికారులు తీసుకుంటున్న అసంబద్ధమైన నిర్ణయాల వల్ల ఉపాధ్యాయ వర్గంలో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వస్తుందన్న విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు ఏ.రామారావు, టీ.హరికృష్ణ, ఆర్‌కే.ప్రసాద్, ఎం.మస్తానయ్య, జ్ఞానశేఖర్, శివకృష్ణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటిన మణికంఠ



గోల్డ్, సిల్వర్ పతకాలతో మణికంఠ

సీతారామపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఆదివారం జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ కాంపిటీషన్ కమ్ సెలక్షన్స్ స్విమ్మింగ్ పోటీల్లో సీతారామపురంలోని బెస్తకాలనీకి చెందిన కానిస్టేబుల్ చెన్నయ్య కుమారుడు పామనబోయిన మణికంఠ సత్తా చాటాడు. అండర్ 19 స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ కాంపిటీషన్స్‌లో ఏకంగా రెండు బంగారు, ఒక సిల్వర్ పతకాలను చేజిక్కించుకుని, ఈనెల 30 నుంచి డిల్లీలో జరిగే జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా మణికంఠను బెస్త కాలనీవాసులు అభినందించారు.

అట్టహాసంగా కాటంరెడ్డి జన్మదిన వేడుకలు

అల్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఆయన నివాసంలో అట్టహాసంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విష్ణు తండ్రి ప్రజాసేవలోనే తనువు చాలించాడని, ఆ మహనీయుడి కుమారుడు విష్ణు కూడా ప్రజాసేవలోనే ఉన్నారని, అలాంటి నాయకులు దొరకడం నేటి రోజుల్లో కష్టతరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, సతీష్‌కుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దండా కృష్ణారెడ్డి, మాధవరావు, పప్పు సుధాకర్, చల్లగుంట్ల సుధాకర్, బత్తల మోహన్‌రరెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

కావలి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కావలి మండలం కొత్తపల్లిలో ఆదివారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు యర్రా మాల్యాద్రి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగవర్పమ్మకు పూజలు



నాగవర్పమ్మను దర్శించుకుంటున్న మహిళలు

సంగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న నాగవర్పమ్మ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంజాయి, జూదం, బెట్టింగ్‌రాయుళ్లపై రౌడీషీట్లు ఓపెన్ చేయండి

- నేర సమీక్షలో డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ, హాజరైన సీఐలు, ఎస్ఐలు

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో పేకాట, కోడి పందేలు లాంటి జూదం నిర్వహణ, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో యువతను ఆర్థికంగా దివాళాతీయిస్తున్న వ్యక్తులపై గట్టి నిఘా పెట్టి రౌడీషీట్లు ఓపెన్ చేయాలని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ఆదేశించారు. స్థానిక సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో ఆదివారం జరిగిన కందుకూరు డివిజన్‌స్థాయి నేర సమీక్ష సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ జూదాలు, బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. గంజాయిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యకలాపాలు ఏ పోలీసుస్టేషన్ పరిధిలో జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రాపర్టీ కేసులు, దొంగతనాలు, యాక్సిడెంట్ కేసులలో దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన కేసులు, పోక్సో కేసులు, సైబర్‌నేరాలు, చీటింగ్ కేసుల్లో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి జైలుకు పంపించాలన్నారు. సోషల్‌మీడియా గ్రూపులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు అన్వర్‌బాషా, మంగారావు, ఆరుగురు ఎస్ఐలు పాల్గొన్నారు.

అలరించిన అయ్యప్పస్వామి భజన



అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట ద్వారకానగరులోని షిరిడీ శేషసాయి మందిరంలో ఆదివారం అయ్యప్పస్వాముల భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్తీక మాసం కావడంతో మందిరావరణంలోని జంటనాగుల శిలల వద్ద తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. స్థానికులు కుట్టుబోయిన మహేంద్రబాబు, శ్రీజల కుమారుడు వశిష్ఠనారాయణ పుట్టిన రోజు సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులు, వృద్ధాశ్రమంలోని పేదలకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటరమణమ్మ, మందిర వ్యవస్థాపకులు బ్రహ్మానందం, వసుంధర దంపతులు, సాయిభక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సంగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఆదివారం స్థలం పరిశీలించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గాంధీజనసంఘంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఇటీవల రూ.32 లక్షల మంజూరు చేయించారు. దీంతో పంచాయతీ రాజ్ డీఈ సుధార్ రెడ్డి, ఏఈ రామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డిలు స్థలం పరిశీలించి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు మానికల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

బిట్రగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట దళితవాడకు చెందిన ఉదయగిరి శ్రీనివాసులు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కావలి రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్, సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి వంటపాత్రలు, నూతన దుస్తులు, టార్పాలిన్‌తో కూడిన రిలీఫ్ కిట్‌ను కావలి రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే.హరినారప రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్, గొట్టిపాటి మనోరమ, జీవిత సభ్యులు బెజవాడ అభిసాగర్ పాల్గొన్నారు.



దుస్తులు, వంటపాత్రలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

త్వరలో ప్రకాశం జిల్లాలోకి కందుకూరు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ఇచ్చిన హామీ మేరకు కందుకూరు నియోజకవర్గం త్వరలోనే ప్రకాశం జిల్లాలో కలవబోతున్నదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో అప్పటి పాలకులు ఇక్కడి ప్రజల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా నెల్లూరు జిల్లాలో కలిపారని, అయితే వారు చేసిన తప్పులను తాము సవరిస్తున్నామని పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలో త్వరలోనే మరో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు ప్రభుత్వం నుంచి రూ.3కోట్లు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.5 కోట్ల రాబోతున్నాయని, అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణ శివారు ప్రాంతాలకు కూడా తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుకు రూ.30 కోట్లతో టెండర్లు పిలిచారని తెలిపారు. మత్స్యకార గ్రామాల్లోని అటవీభూముల్లో నిర్మించిన కాలనీల ప్రజలకు పొజిషన్ సర్టిఫికెట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, పూరిమెట్ల గురునాథం, చదలవాడ కొండయ్య, మోషే, ఎస్వీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

- **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 48 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.37.21 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత కుటుంబాలకు అందజేశారు. పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

ఉత్సాహంగా కుల సంఘాల కార్తీక వనభోజనాలు



సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ, మండలంలో ఆదివారం పలు కుల సంఘాల కార్తీక వనభోజన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని ఆముదాలదిన్నె వద్ద జరిగిన గౌడసంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని గౌడ సామాజిక వర్గ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గౌడసంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2026వ సంవత్సర నూత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ జరిగిన కార్యక్రమాలను తిలకించారు. అలాగే వైకుంఠపురంలోని ఏటూరి రామిరెడ్డి తోటలో జరిగిన రెడ్డి సంక్షేమ సంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేద విద్యార్థులకు పుస్తకాలు, ప్రతిభకలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఏటూరి రామిరెడ్డి సేవలను స్మరించుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమ నిర్వాహకులను సత్కరించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. సాయంత్రం ఆర్యవైశ్యమిత్ర మండలి ఆధ్వర్యంలో కొత్త బజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద జరిగిన వనభోజన మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని నార్త్ జనతాపేటలో ఏర్పాటు చేసిన నిరామయ యోగా థెరపీ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా అత్యంత అవసరమని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిలు, ఆందోళనలు పెరిగిన నేపథ్యంలో యోగా, నేచురల్ థెరపి ద్వారా ప్రజలు ఆరోగ్యకరమైన జీవనం గడపగలరని ఎమ్మెల్యే తెలిపారు.

ముమ్మరంగా పొగ నాట్లు



అయ్యవారిపల్లెలో పొగ నాట్లు వేస్తున్న కూలీలు

వలేటివారిపాలెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పొగనాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మొంథా తుఫాన్ ప్రభావం వలన ఎడతెరిపి లేకుండా వారం రోజులు వర్షాలు కురిశాయి. ముందుగానే పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రస్తుతం వర్షం తెరపివ్వడంతో నాలుగైదు రోజులు నుంచి పొగనాట్లు చేపట్టారు. ఎర్రరేగడి, నల్లరేగడి రైతులు ఒక్కసారిగా పొగనాట్లు వేయడంతో పొగనాట్లు ముమ్మరమయ్యాయి. దీనికి తోడు పొగనారు మూట ధర రూ.6 వేలకు పెరిగింది. దీంతో పొగనారు, కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తిరిగి వర్షం పడితే మళ్లీ 10 రోజులు పొలాలు అరవు అనే ఉద్దేశ్యంతో రైతులు పొగనాట్లు ప్రక్రియను వేగవంతం చేశారు. కూలీలకు ఒక్కొక్కరికి రూ.400 ఇస్తున్నారు. అయితే కూలీలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు కాంట్రాక్టుకు రూ.3 వేలు ఇచ్చి నాట్లు వేయించుకొంటున్నారు. దీంతో పాటు వాటర్‌ట్యాంక్‌కు వెయ్యి చెల్లిస్తున్నారు. మొత్తంగా రైతులు పొగ నాటలో బిజీగా ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



కావలిలో జరిగిన ఎస్ఎఫ్ఐ మహాసభలో పాల్గొన్న నాయకులు

కావలి(టౌన్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6000 కోట్లు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీ.నరేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కామ్రేడ్ శివరామసుబ్బయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చి 16 నెలలు కావస్తున్నప్పటికీ విద్యారంగం పట్ల ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 77 జీవోను వెంటనే రద్దు చేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందేవిధంగా కృషి చేయాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శిగా జయంత్, సునీల్, ఉపాధ్యక్షుడుగా వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా వర్షిత్, అజ్మత్, సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ కార్యవర్గం

కావలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ సమావేశం ఆదివారం పట్టణంలోని మేధా జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లూరు సిటీ యూనిట్ సెక్రటరీ బీ.కిరణ్‌కుమార్ ఎన్నికల అధికారిగా, వీ.ఫణీంద్రబాబు సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కావలి తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడుగా డాక్టర్ ఎం.చైతన్య, ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీధర్‌బాబు, సీహెచ్.సుకుమార్‌బాబు, ఎన్‌వీ.సతీష్, డీ.రత్నాకర్, పీ.శ్రీహరిబాబు, కార్యదర్శిగా బీకే.చలపతిరావు, కోశాధికారిగా బీ.పద్మజ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.రేవతి, సంయుక్త కార్యదర్శులుగా బీవీ.రాధాకుమారి, డీ.అనిల్‌కుమార్, పీ.మనోజ్‌కుమార్, బీ.నారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు అభినందించారు.

చంద్రన్న ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సవరం వెంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్య లక్ష్మమ్మకు రూ. 5 లక్షల చంద్రన్న ప్రమాద బీమా చెక్కును టీడీపీ నాయకులు ఆదివారం అందజేశారు. టీడీపీ సభ్యత్వం కలిగిన వెంగయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సమగ్ర వివరాలతో విజయవాడ పార్టీ కార్యాలయానికి పంపడంతో వెంగయ్యకు రూ. 5 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరయింది. ఆ చెక్కును మృతుడి భార్య లక్ష్మమ్మకు టీడీపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల తిమ్మయ్య, దాపనేని చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనం విజయవంతం చేయండి



కార్తీక వనభోజనం ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న యాదవులు

సంగం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ఆధ్వర్యంలో మర్రిపాడు మండలలోని పీఎస్ఆర్ బృందావనంలో ఈనెల 16వ తేదిన జరిగే కార్తీక వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా యాదవ భవన్ ట్రస్ట్ అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన సంగంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి వనభోజన మహోత్సవంపై ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనభోజన మహోత్సవంలో గోపూజ, ఉసిరి చెట్టు పూజ, విశలింగ పూజ కార్యక్రమాలు జరుగుతాయని, జిల్లాలోని యాదవులంతా కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగం సొసైటీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, పీలం సురేష్‌యాదవ్, హరిబాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత పొందూరి వెంకటకృష్ణారెడ్డి


కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై నేతలు దృష్టి సారించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటడం లక్ష్యంగా ప్రతి గ్రామంలో క్రియాశీల సభ్యులను నియమించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు పొందూరు వెంకటకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణశాఖ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్త నాయకుడేనని, బూత్ కమిటీలు, శక్తి కేంద్ర బాధ్యులు, వివిధ మోర్చాల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, గట్టమనేని హరిబాబు, జొన్నాదుల సురేష్, జగన్నాథం వైకుంఠం, చల్లా వెంకటరాజా, మాల్యాద్రినాయుడు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కలిగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరులో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆది దంపతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



శివపార్వతుల కల్యాణంలో భక్తులు



నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదివారం తెలిపారు. సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 8977716661కు సమస్యలు తెలియజేయాలని కోరారు. లేదంటే 9133331912కు మెసేజ్ పెట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

రూ.2వేల కోట్లతో పరిశ్రమలు

● రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం



ప్రారంభానికి సిద్ధమైన కోర్టు యార్డు మారియట్ హోటల్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రూ.2వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. నాయుడుపేట సెజ్ పరిధిలో రూ.200 కోట్ల పెట్టుబడులతో 3ఎక్స్ ఫర్ ఇన్నోవేచర్ లిమిటెడ్ ఫార్మసుటికల్స్ ప్రారంభం కానుంది. ఇందులో 300మందికి పైగా ప్రత్యక్షంగా, మరో వందమందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. అక్కడే రూ.300 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ తయారు చేసే దమ్ము బయో ఫ్యూయల్స్ కంపెనీకి శంకుస్థాపన చేయనున్నారు. దీనిద్వారా 500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. తిరుపతి రూరల్ తిరుచానూరు వద్ద రూ.200కోట్లతో నిర్మితమైన కోర్టుయార్డు మారియట్ స్టార్ హోటల్ ప్రారంభం కానుంది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300మందికి ఉపాధి లభించనుంది. వీటితోపాటు సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు, సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం శిరసనంబేడు, గూడూరు నియోజకవర్గం కొమ్మనెట్టూరులో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. తిరుచానూరు వద్ద మారియట్ హోటల్‌ను, నాయుడుపేట సెజ్‌లో దమ్ము బయో ఫ్యూయల్స్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించనున్నారు.

విద్యుత్ అదనపు లోడ్డు క్రమబద్ధీకరణ గడువు పెంపు

తిరుపతి(ఆటోనగర్),నవంబరు9 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల్లో గృహ విద్యుత్ వినియోగదారులు అదనంగా ఉన్న లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ కోరారు. ఇంకా చాలామంది వినియోగదారులు చేసుకోని కారణంగా డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. విద్యుత్ సర్వీసు తీసుకునే సమయంలో దరఖాస్తులో పొందుపరచిన లోడ్‌కంటే అదనంగా వాడిన వారు తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.కిలోవాట్‌కు 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రాయలచెరువు బాధితులకు రూ.3.24కోట్ల సాయం



కలెక్టర్ చొరవతో రికార్డు సమయంలో మంజూరైన నిధులు

జిల్లాలోని కేవీబీపురం మండలంలో ఓకూరు రాయలచెరువు కట్ట తెగిన ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రూ.3.24 కోట్ల మేరకు ప్రభుత్వ సాయం మంజూరైంది. కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ చొరవ తీసుకోవడంతో రికార్డు సమయంలో నిధులు విడుదలయ్యాయి. ప్రభుత్వ పరంగా ఇంత వేగంగా విపత్తు బాధితులకు ఆర్థిక సాయం అందిన దాఖలాలు ఇప్పటి దాకా ఎక్కడా లేదు. దీనికి సంబంధించిన పూర్వాపరాలిలా వున్నాయి.

సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలం ఓకూరు పంచాయతీ పరిధిలోని రాయలచెరువు కట్ట ఈనెల 6వ తేదీన తెల్లవారుజామున తెగిపోయిన సంగతి తెలిసిందే. ముందస్తు హెచ్చరికలు, పోలీసు యంత్రాంగం వేగంగా స్పందించడంతో పెనుముప్పు తప్పింది. అయితే సమయం చాలా తక్కువగా ఉండటంతో ప్రాణాలు కాపాడుకునే ఆత్రుతలో ముఖ్యంగా కళత్తూరు దళితవాడ వాసులు భారీగా నష్టపోయారు. గ్రామంలోకి ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తున చెరువు నీరు ప్రవహించడంతో ఇళ్లలోని ధాన్యం సహా సామాన్లు అన్నీ కొట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో పశువులు చనిపోయాయి. కళత్తూరు దళితవాడ తీవ్రంగా దెబ్బతినగా పాతపాలెం, ఎస్ఎల్ పురం గ్రామాలలో కూడా కొంత మేర నష్టం సంభవించింది. ఈ మూడు గ్రామాల్లో కలిపి 980 ఇళ్లలోకి చెరువు నీరు చేరింది. దుర్ఘటన జరిగిన సమయానికి కలెక్టర్ విజయవాడలో ఉన్నారు. అక్కడి నుంచే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి హుటాహుటిన బాధిత గ్రామాలకు అధికారులను, ఉద్యోగులను పంపించారు. సహాయక చర్యలకు ఆదేశాలివ్వడడంతో పాటు సాయంత్రానికి కేవీబీపురం చేరుకుని స్వయంగా బాధిత గ్రామాలలో పర్యటించారు. కళత్తూరు దళితవాడ వాసులకు జరిగిన తీవ్ర నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ వేగంగా స్పందించారు.

ఓ వైపు సహాయక చర్యలను కొనసాగిస్తూనే మరోవైపు అంతే వేగంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నష్టపోయిన 960 కుటుంబాలలో ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు చొప్పున తక్షణ ఆర్థిక సాయం కోసం రూ.28.80 లక్షలు, 1,100 పశువులు నీళ్లలో కొట్టుకుపోయిన నేపథ్యంలో ఆయా రైతులకు ఆర్థిక సాయంగా రూ.2.95 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. అదనంగా బాధిత కుటుంబాలలో ఒక్కో దానికి 25 కిలోలు బియ్యం, కిలో కంది పప్పు, లీటరు పామాయిల్, కిలో ఎర్రగడ్డలు, కిలో బంగాళాదుంపలు, కిలో చక్కెర తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాల్సిన అవసరముందని అభ్యర్థించారు. ప్రభుత్వ మౌఖిక అనుమతితో నిత్యావసర వస్తువులు ఇప్పటికే పంపిణీ చేసేశారు. ఇలాంటి విపత్తులు సంభవించినపుడు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం, నష్టపోయిన కుటుంబాలకు రూ. 500 ఆర్థిక సాయం అందించడం సాధారణంగా జరిగేదే. కలెక్టర్ ప్రత్యేక చొరవ కారణంగా కుటుంబానికి రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం అంగీకరించింది. కాగా విపత్తుల సందర్భంగా పాడిపశువులు మృతి చెందితే ప్రభుత్వం పరిహారం ఇచ్చినా పశువుకు రూ.50 వేలు ప్రకటించడం అరుదు. పరిహారం మంజూరుకు కూడా చాలా సమయం తీసుకుంటుంది. అయితే రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో పశువులను కోల్పోయిన బాధితులకు పశువుకు రూ. 50 వేలు చొప్పున సాయం అందేలా కలెక్టర్ ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఆ సాయం కూడా మూడు రోజుల్లోనే ప్రభుత్వం నుంచి విడుదల చేయించడం మరింత అరుదనే చెప్పాలి. నిత్యావసర వస్తువుల పంపిణీకి అదనంగా రూ.3.24 కోట్ల ఆర్థిక సాయాన్ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల బాధితుల్లోనే కాకుండా జిల్లా ప్రజల్లో సైతం ప్రభుత్వం పట్ల, జిల్లా యంత్రాంగం పట్ల నమ్మకాన్ని పెంచినట్టయింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి







అటవీ శాఖ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకిస్తూ...

కుంకీల విన్యాసాలను సెల్‌ఫోన్లో బంధిస్తూ...

కుంకీల కోసం కృషి చేశా:అమర్



అడవి ఏనుగుల ద్వారా మనుషుల ప్రాణాలకు, పంటలకు తీవ్ర నష్టం కలుగుతోందని, కుంకీ ఏనుగులతోనే దీన్ని నివారించవచ్చని గుర్తించాను.అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మీకు ఈ విషయంగా అర్జీ ఇచ్చాను. అసెంబ్లీలో ఇదే విషయమై రెండుసార్లు మాట్లాడానంటూ పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చెప్పారు.తానీ విషయంలో చేసిన కృషికి సంబంధించిన రికార్డులను పవన్‌కు అందించారు.అటవీ శాఖ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సమయంలో ఏనుగుల మంద కంటే ఒంటరి ఏనుగులతోనే ఎక్కువ ప్రమాదమంటూ వివరించబోయిన అమర్‌ను తాను మాట్లాడతానంటూ పవన్ వారించడం ఎమ్మెల్యేని నొచ్చుకునేలా చేసింది.

మంగళంపేట అటవీ భూముల సర్వే

కల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలోని అటవీ భూములను ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏరియల్ సర్వే నిర్వహించినట్లు అటవీశాఖ రేంజర్ థామస్ సుకుమార్ తెలిపారు. మంగళంపేట సమీపంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన వ్యవసాయ భూములకు సమీపంలో అటవీ భూమి ఆక్రమణకు గురైందని ఈ ఏడాది జనవరిలో కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో తదితర అధికారులు పరిశీలించారు. అనంతరం ఆక్రమణకు గురైన అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం పలమనేరు పర్యటనకు వెళుతూ ఏరియల్ సర్వే చేపడతారని అటవీశాఖ అధికారులు ఉదయంతోనే అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. డిప్యూటీ సీఎంకు కనిపించేలా ఆ ప్రాంతంలో ఎరుపు రంగు జెండాను నాటి మంటలు రాజేసి పొగపెట్టారు.పవన్ కల్యాణ్ పలమనేరు పర్యటనలు ముగించుకొని తిరిగి వెళుతూ మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేసినట్లు రేంజర్ తెలిపారు.



ముసలిమడుగులో రెండు గంటలు

● ఆద్యంతం చలాకీగా పవన్



అభిమానులతో సెల్ఫీ

పలమనేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలమనేరు పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆయన్ను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు ఎగబడ్డారు. వారి తాకిడిని తట్టుకోలేక పోలీసులు ఆ ప్రాంతమంతా ఆంక్షలు విధించారు. షెడ్యూల్ కంటే గంట ఆలస్యంగా పలమనేరు సమీపంలోని పెంగరగుంట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్న పవన్‌కు స్వాగతం పలికేందుకు కేవలం 8మందినే లోపలికి అనుమతించారు. జనసేన నాయకులు చాలామందికి అనుమతి లభించకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్,కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్, డీఎఫ్‌వో సుబ్బరాజు తదితరులు పవన్‌కు స్వాగతం పలికారు. హెలిపాడ్ చుట్టూ తన కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు పవన్ అభివాదం చేశారు. ఎమ్మెల్యే గురజాల సూచన మేరకు తమిళనాడు నుంచి వచ్చిన అభిమానుల వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు. హెలిపాడ్ బయట పలువురు ఆయనకు సమస్యల మీద అర్జీలు ఇచ్చారు. అక్కడి నుంచి కారులో నేరుగా ఎలిఫెంట్ క్యాంపు వద్దకు వెళ్లిన పవన్ అటవీశాఖ అధికారుల పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ఏనుగులతో మనుషులకు జరుగుతున్న అన్నిరకాల నష్టాల్ని తగ్గించే చర్యలు' అనే అంశంపై నిర్వహించిన ఈ ప్రజంటేషన్ చూశాక అధికారులకు పలు సూచనలు చేశారు. హనుమాన్ ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు.కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించారు.దాదాపు రెండుగంటల పాటు ముసలిమడుగులో వున్న పవన్ ఆద్యంతం చలాకీగా గడిపారు.

నిరాశలో జనసేన శ్రేణులు

తమ పార్టీ అధినేత డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి జిల్లాకు రావడంతో జనసేన శ్రేణులు మురిసిపోయారు. తాము కలిసే అవకాశం ఉంటుందని, మాట్లాడి ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుందని భావించినా వారికి నిరాశే మిగిలింది. సాధారణంగా సీఎం చంద్రబాబు జిల్లాల్లో పర్యటించినప్పుడు టీడీపీ ముఖ్య శ్రేణుల కోసం సమయాన్ని కేటాయిస్తారు. అలాగే లోకేశ్ పర్యటనల్లో శ్రేణుల కోసం సమయం కేటాయించి ఫొటోలు తీసుకుంటారు. ఆదివారం పవన్ కూడా అలా శ్రేణుల్ని, కనీసం నాయకుల్ని పలకరిస్తారని ఆశించారు. జనసేన నాయకులతోనే కాకుండా టీడీపీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కూడా సమయాభావం వల్ల రిజర్వ్‌డ్‌గానే వ్యవహరించారు.

తోపులాటలో మహిళకు గాయాలు



ఎలిఫెంట్ క్యాంపును సందర్శించి తిరిగి హెలిప్యాడ్‌కు డిప్యూటీ సీఎం వెళ్తుండగా మార్గమధ్యంలోని ఇందిరానగర్ వద్ద పవన్ అభిమానులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. హేమ అనే మహిళ అభిమానంతో హారతి ఇచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు, అక్కడున్న అభిమానులు పక్కకు తోయడంతో ఆమె కాలికి గాయాలయ్యాయి.'ఆమెను పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి అన్ని పరీక్షలు నిర్వహించగా, ఎడమకాలికి చిన్న గాయమైందని..ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంగా వివిధ టీవీ ఛానెళ్లలో వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన యువకుడి అరెస్టు

వెంకటగిరి, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో వెంకటగిరి పట్టణం బొగ్గులమిట్టకు చెందిన కొండూరు చంద్రశేఖర్‌రాజును కృష్ణ జిల్లా పెనగలూరు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అతని ఇంటి వద్ద అరెస్టు చేశారు. ఇటీవల మాలపాటి భాస్కర్‌రెడ్డి అరెస్టు తర్వాత పోలీసులు సోషల్ మీడియాలో పాత పోస్టులపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. భాస్కర్‌డ్డిని విచారించే సమయంలో చంద్రశేఖర్‌రాజు పేరు వెలుగులోకి వచ్చింది. ఆయన ఖాతా నుంచి వెలువడిన పాత పోస్టులను బయటకు తీశారు. అందులో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించి ఉండటంతో అరెస్టు చేశారు.



జగన్‌తో చంద్రశేఖర రాజు

పరకామణి కేసులో నేడూ విచారణ

● అధికారుల ముందుకు ఇద్దరు పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి కేసులో అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు రవికుమార్, అతని భార్య రమ్య, కుమార్తె ప్రనూషలు విచారణలో వెల్లడించిన వివరాలతో విచారణ వేగవంతానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో తిరుమలలో పనిచేసి వీఆర్‌లో ఉన్న జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్ బృందం సోమవారం విచారించనుంది. ఇప్పటికే టూ టౌన్ సీఐగా పనిచేసి వీఆర్‌కు బదిలీ అయిన చంద్రశేఖర్‌ను విచారించారు. లోక్ అదాలత్‌లో రాజీ ప్రొసీడింగ్స్ రవికుమార్ ఆస్తిపత్రాలు, టీటీడీ ఎస్టేట్ అధికారుల నుంచి సేకరించిన డాక్యుమెంట్లు ఆధారంగా దర్యాప్తుపై దృష్టి సారించారు. చెన్నైలో రవికుమార్‌కు సంబంధించిన స్థిర, చరాస్తులపై ఆరా తీయనున్నట్లు తెలిసింది. ఇందుకోసం మరో వారం రోజుల్లో సీఐడీ అధికారులు చెన్నైకు వెళ్లి స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఐజీని కలవనున్నారు. వివరాలు సేకరించనున్నారు. ఈ మొత్తం వివరాలతో కూడిన నివేదిక, ఆధారాలు హైకోర్టు ఎదుట సమర్పించనున్నారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.1.61కోట్లు విడుదల

● ఉమ్మడి జిల్లాలో 26 పాఠశాలల్లో ఊపందుకోనున్న పనులు

తిరుపతి(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మెరుగుదల, పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.61కోట్లు విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 26 పాఠశాలల్లో ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణం, ఎలక్ట్రిఫికేషన్, ప్రధాన మరమ్మతుల కోసం ఈ నిధులు వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నిధుల వినియోగం, అమలు, పనుల పర్యవేక్షణ బాధ్యతలను పాఠశాలల నిర్వహణ కమిటీలకు అప్పగించింది.

తిరుపతి జిల్లాకు రూ.60.90లక్షలు : తిరుపతి జిల్లాలో 9 పాఠశాలల్లో నాలుగింటిలో ప్రహరీ గోడలు, మూడింటిలో మరుగుదొడ్లు, రెండింటిలో ప్రధాన మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందుకుగాను రూ.60.90 లక్షలు కేటాయించారు. **చిత్తూరు జిల్లాకు రూ.1.01 కోట్లు :** చిత్తూరు జిల్లాలో 17 పాఠశాలలకుగాను ఏడింటిలో ప్రహరీ గోడలు, మూడింటిలో బాలుర మరుగుదొడ్లు, ఆరింటిలో బాలికల మరుగుదొడ్లు, ఒక్క పాఠశాలలో ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టనున్నారు. రూ.1.01 కోట్లను విడుదల చేసింది.

డిసెంబరులో రెండు ప్రయోగాలకు షార్ సన్నద్ధం

సూళ్లూరుపేట,నవంబరు9(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) డిసెంబరులో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి రెండు ప్రయోగాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుంది. డిసెంబరు తొలివారంలో శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికన్ కమ్యూనికేషన్ బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగం చేపట్టనుంది. చివరివారంలో పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం మొదటి ప్రయోగ వేదిక నుంచి చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సన్నద్ధమవుతున్నారు. ఈ రాకెట్‌కు వినియోగించే పరికరాలు ఆదివారం కేరళలోని తిరువనంతపురం వీఎస్ఎస్‌సీ సెంటర్ నుంచి ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ షార్‌కు చేరాయి. రెండో వాహక అనుసంధాన భవనం (వ్యాబ్)లో ఎల్వీఎం3-ఎ6 రాకెట్ అను సంధాన పనులు జరుగుతున్నాయి. మొదటి ప్రయోగ వేదిక వద్ద పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగ పనులు కూడా జరుగుతున్నాయి. రెండు ప్రయోగాలనంతరం వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రైవేట్ వారి భాగస్వామ్యంతో పీఎస్ఎల్వీ-ఎల్ 1 రాకెట్ ప్రయోగించనున్నారు. రాకెట్ల తయారీ ఒప్పందం కింద ప్రైవేట్ రంగం వారు తయారీ చేసిన తొలి పీఎస్ఎల్వీ రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది.

ప్రమాదకరంగా కల్వర్టు



రక్షణగోడ కూలిపోయిన కల్వర్టు

గూడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక నాయుడుకాలువ కట్ట ప్రాంతంలోని కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. కాలువపై గతంలో నిర్మించిన కల్వర్టు రక్షణగోడలు కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గం ద్వారా నాయుడుకాలువకట్ట, రాణిపేట తదితర ప్రాంతాలకు చెందిన స్థానికులు పాతబస్టాండు వైపు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టుకు రక్షణగోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవలేదు. రాత్రి సమయాల్లో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నారులు ఆడుకునే సమయంలో, రాత్రి వేళలో వృద్ధులు కల్వర్టు వద్ద కాలువలో పడి క్షతగాత్రులయ్యారు. అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



మాలయకోటవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు చెప్పారు. పట్టణ పరిధిలోని మాలయకోటలో ఆదివారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ బయట ప్రాంతాల నుంచి ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వాహనాలు నడిపేవారు అన్ని ధృవీకరణ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, ఎస్ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో...



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామ సుందర పురంలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ జరిగింది. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు ఎస్ఐలు పవన్ కుమార్, నాగబాబు, చిన్నబలరామయ్య, ట్రైనీ ఎస్ఐ నిఖిల్ దాడులు నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని 25 బైక్‌లు, ఆటోలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

శాస్త్రోక్తంగా మార్తాండ వజ్ర భైరవ హోమం



రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తి పీఠంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మార్తండ వజ్ర భైరవ హోమాన్ని హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 11వేల గారెలతో మార్తాండ వజ్ర భైరవ హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం స్వామీజీ అనుగ్రహ బాషణం చేశారు. పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతులకు పూలంగి సేవ



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపాన అగస్త్యేశ్వరాలయంలో రుద్రపాదాల ము క్కోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతులకు ఘ నంగా పూలంగి సేవను నిర్వహించారు. ఉదయం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లిదేవికి అభిషేకం నిర్వహించాక దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులను నంది వాహనంపై అధిష్ఠింపజేసి భక్తులకు దర్శనమిచ్చారు. 10 గంటలకు ఉత్సవర్లను విశేషంగా అలంకరిం సుగంధభరిత పుష్పాలతో పూలంగిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. రాత్రి స్వామిఅమ్మవార్లు రావణాసుర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌కు అవగాహన సదస్సు

తిరుపతి అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఆదివారం స్థానిక ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) ఆధ్వర్యంలో లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా సీపీఓ దేవికుమారి, సాంకేతిక నిపుణులు వంశి, సందీప్ పాల్గొని సాఫ్ట్‌వేర్‌లో వచ్చిన మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో టేప్ చైర్మన్ టి.వెంకటేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్స్ సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ బి.షణ్ముగం, బంగారయ్య, శివశంకర్‌రెడ్డి, నరేష్, సురేష్, వసంతరావు, కిషోర్, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్ ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన వాత్తియావీరన్

తడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని రామాపురం కుప్పం గ్రామానికి చెందిన వాత్తియా వీరన్(48) ఆదివారం రాత్రి రామాపురం బస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ నిలబడి ఉండగా చెన్నై వైపు వెళ్తున్న బైక్ అతివేగంగా వచ్చి ఢీకొంది. వాత్తియావీరన్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే ఎలావూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆదివారం సాయంత్రం పూడికుప్పం వద్ద జాతీయ రహదారిపై చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు పాదచారిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలపాలై పాదచారి మృతి చెందాడు. మృతిడి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు దొరకలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కొండప నాయుడు తెలిపారు.



హోలిక్రాస్ సర్కిల్ సమీపంలో జాతీయ రహదారిపై పార్కింగ్ చేసిన లారీలు - ఆర్టీవో కార్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆపిన వాహనాలు

హైవే పైనే వాహనాల పార్కింగ్

ట్రాఫిక్‌తో పాటు రాత్రిపూట ప్రమాదాలు ● పట్టించుకోని పెట్రోలింగ్ పోలీసులు

సూళ్లూరుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో జాతీయ రహదారిపై, పట్టణంలోని ఇతర ప్రదేశాల్లో వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామిక వాడలకు వెళ్లే ట్రావెల్స్ బస్సులు, మినీ వ్యాన్‌లు సూళ్లూరుపేట హోలిక్రాస్ కూడలి నుంచి కోటపోలూరు క్రాస్ రోడ్డు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా ఆపేస్తున్నారు. అలాగే సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలతో పాటు లారీలు బారులు తీరుతున్నాయి. దీనికి తోడు హోటళ్లు, దాబాల వద్ద ఉదయం, మధ్నాహ్నం, రాత్రి సమయాల్లో వాహనాలతో పాటు లారీలు బారులు తీరుతున్నాయి. దీంతో ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. శని, ఆదివారాల్లో కంపెనీలకు సెలవు కావడంతో ఆ పరిశ్రమలకు వెళ్లే వాహనాలన్నింటినీ జాతీయ రహదారి పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. ఇక హోలిక్రాస్ సర్కిల్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోని ఓ వేబ్రిడ్జి వద్ద రాంగ్‌రూట్‌లో లారీలు పార్కింగ్ చేయడంతో ద్విచక్ర వాహనాలు, పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. రాంగ్‌రూట్‌లో పార్కింగ్ చేయడం వల్ల సర్వీసు రోడ్డు, ఇళ్ల వద్ద నుంచి వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలో ఆర్టీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో కూడా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యర్థాలు తొలగవు.. మురుగు పారదు

కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు



లూథరన్ చర్చి వద్ద ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన మురుగుకాలువ - వినాయకుడిగుడి వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారి జీఎన్‌టీ రోడ్డుకు రెండువైపులా ఉన్న మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో ఎక్కడ చూసిన వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్రధానం జీఎన్‌టీ రోడ్డులో రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి వినాయకుడి గుడి సెంటర్, హోలిక్రాస్ కూడలి వరకు మురుగు కాలువలు వ్యర్థాలతో నిండి పూడిపోయాయి. కాలువల్లో మురుగునీరు కదలక రోడ్లపై, నివాసాల నడుమ చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతోంది. కాలువల్లో పూడికతో చిన్నపాటి వర్షమొచ్చినా నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. సాక్ష్యాత్తు మున్సిపాలిటీ కార్యాలయం వద్దే పరిస్థితి దారుణంగా ఉంది. వర్షమొచ్చినప్పుడు ఎక్స్‌కవేటర్లతో పూడిక తీయించి వదిలేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. జీఎన్‌టీ రోడ్డు లూథరన్ చర్చి ఆనుకుని ఉన్న కాలువ ప్లాస్టిక్ కవర్ల నిండి పూడిపోయింది. అదే విధంగా ఇవతలి వైపు కాలువలో పోలీసుస్టేషన్ వద్ద, వినాయకుడిగుడి సెంటర్‌లో కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి మురుగు కదలడం లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పూడిక తీయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో వ్యర్థాలను తొలగించి మురుగు కదిలేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాశిం జశ్వంత్‌కు పలువురి అభినందనలు

వాకాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని మహాత్మాగాంధీ యూనివర్శిటీలో ఎండీ (జనరల్ మెడిసెన్) చదువుతున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తనయుడు జశ్వంత్‌కుమార్‌కు యూనివర్శిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్‌ను సాధించాడు. అతడికి టీడీపీ మండల నాయకుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, కల్లూరు హరీష్‌నాయుడు, దువ్వూరు జనార్థన్‌రెడ్డి, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

టీడీపీ నేతకు పలువురి శుభాకాంక్షలు



జగన్‌మోహన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్ తదితరులు

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో ఆదివారం సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, షిరిడీసాయి అక్షయసేవాసమితి ప్రతినిధి అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పక్కా గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెళ్లకూరు, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పక్కా గృహాలు లేని ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ వెంకయ్య కోరారు. సోమవారం నుంచి హౌసింగ్ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తారని, ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు స్థలాలు చూపాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెళ్లకూరు, నవంబరు, 8(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపేవారికి, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ లేని వాహనదారులకు జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు.

గూడలి సంగమేశ్వరాలయంలో అన్నాభిషేక వేడుకలు



కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వర ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా అన్నాభిషేకం వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ పర్యవేక్షణలో సంగమేశ్వరుడి మూల విరాట్‌కు అన్నాభిషేకం చేశారు. స్వామివారి విగ్రహానికి అన్నంను కప్పి ప్రత్యేక అలంకరణచేశారు. కామాక్షీదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు లభించింది.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన మహిళ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ బైరాగి పట్టెడలో ఉంటున్న సుబ్రహ్మణ్యం భార్య తిరుమణ్యం సుచరిత శనివారం ఇంట్లో పిల్లలపై అలిగి ఎక్కడికో వెళ్లిపోయింది. ఈమె ఐదు అడుగుల ఎత్తు, ఫ్లోరోసెంట్ బ్లూ కలర్ చీర, బ్లూ కలర్ జాకెట్ ధరించి ఉంది. ఈమె ఆచూకీ తెలిసిన వారు 9492256999కు కానీ, లేకుంటే రూరల్ సీఐ 9491074525కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

బామ్‌సెఫ్ కార్యాలయం ప్రారంభం



బామ్‌సెఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

నాయుడుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని అంబేడ్కర్ భవనం సమీపంలో డీజే రాజు కాంప్లెక్స్‌లో బామ్‌సెఫ్(బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్) కార్యాలయాన్ని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పేర్నాటి వెంకటేశ్వర్లు, సీనియర్ ఉద్యోగులు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బందిలి శ్రీనివాసులు, నలమాకుల శ్రీనివాసులు, జడ్డా వెంకటరావు, రామకృష్ణ, డీవీ కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిక్సిడ్ కాలనీకి చెందిన పోలమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ రూ.మూడు వేలు మాజీ సర్పంచు రామ్మూర్తి, స్థానిక నేతలు సూర్యనారాయణ, మోహన్ ద్వారా పోలమ్మ కుటుంబసభ్యులకు అందజేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చిట్టమూరు విద్యార్థి



వాలీబాల్ క్రీడాకారుడు హర్ష

చిట్టమూరు, అక్టోబర్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చిట్టమూరులోని జీఎం నాయుడు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి.హర్ష ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో హర్ష ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో హర్ష పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థిని ఎంఈవో కృష్ణయ్య, హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

దొరవారిసత్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తల్లంపాడు, అక్కరపాక, తనియాలి గ్రామాల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైసీపీ మండల కన్వీనర్ రాహుల్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ అనీల్‌రెడ్డి, నాయకులు మునస్వామి నాయుడు, సురేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వేమురెడ్డి, దయాకర్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, దినేష్‌రెడి పాల్గొన్నారు.